ఎంబీబీఎస్ ఫస్టియర్‌లో 88 శాతం ఉత్తీర్ణత

ప్రతిభచాటిన సంగారెడ్డి మెడికల్ కాలేజీ విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 23: సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎంబీబీఎస్-2022(ఫస్టియర్) పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. కళాశాలలోని 150 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 66 మంది ఫస్ట్ క్లాస్‌లో పాసవగా, ఇద్దరు ఉత్తమ మార్కులు(డిస్టింక్షన్స్) సాధించారు. 88 శాతం ఉత్తీర్ణత నమోదైందని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వాణి తెలిపారు. ఎంబీబీఎస్ ఫస్టియర్ పరీక్షలు గతేడాది నవంబరులో జరగగా, ప్రాక్టికల్ పరీక్షలు డిసెంబరులో జరిగాయి.




భరోసా కొందరికే!

- 3.62 లక్షల మంది రైతులకు చెల్లించాల్సిన మొత్తం రూ.375 కోట్లు
- 2,35,524 మంది ఖాతాల్లో రూ.108 కోట్లు జమ
- 1,24,476 మందికి రూ.267 కోట్లు బకాయి

సంగారెడ్డి టౌన్, జనవరి 23: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా కింద పెట్టుబడి సాయం కొందరికే అందింది. పంటల సాగు కోసం ప్రభుత్వం ప్రతీ ఎకరాకు రూ.5వేల చొప్పున పెట్టుబడి సాయం అందజేస్తున్న విషయం తెలిసిందే. యాసంగి సీజన్ నవంబరులోనే ప్రారంభమైనప్పటికీ ఎన్నికలకోడ్ అమలులోకి రావడంతో రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుబంధు పథకం పేరును రైతుభరోసాగా మార్చింది. రైతులకు అందజేయాల్సి సాయం పాక్షికంగా అందజేసింది. సంగారెడ్డి జిల్లాలో యాసంగి సీజన్‌లో మొత్తం 3.62 లక్షల మంది రైతులకు మొత్తం రూ.375 కోట్లు జమ చేయాల్సి ఉన్నది. ఇప్పటివరకు 2,35,524 మంది రైతుల ఖాతాల్లో రూ.108 కోట్లు జమ చేసినట్టు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఇంకా 1,24,476 మందికి రూ.267 కోట్లు రావాల్సి వుంది. ఇప్పటివరకు రెండెకరాల లోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే అందినట్టు తెలిసింది. రెండెకరాలకు పైగా భూమి కలిగిన రైతులు రైతు భరోసా సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

మిగిలింది వారం రోజులే..

బిల్లులివ్వరా?



ఆరెగూడెంలో నిర్మాణంలో ఉన్న పంచాయతీ భవనం

పెండింగ్ బిల్లుల కోసం సర్పంచ్‌ల ఎదురుచూపులు

- వారంలో ముగియనున్న పదవీ కాలం
- మెదక్ జిల్లాలో 469 పంచాయతీల పరిధిలో రూ. 20 కోట్ల బకాయిలు
- పంచాయతీల్లో సగటున రూ. 3 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు..
- ఆందోళనలో గ్రామ ప్రథమ పౌరులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, మెదక్, జనవరి 23: ప్రగతి పేరుతో లక్ష్యాలు.. గడువు లోగా పూర్తికాకుంటే అధికారుల హెచ్చరికలు.. వెనకడుగువేస్తే ప్రజల నుంచి ఒత్తిళ్లు.. గ్రామ ప్రథమ పౌరుడైనందున పరువు నిలుపుకునేందుకు ఆరాటం.. పదవిని కాపాడుకునేందుకు పోరాటం.. వెరసి ప్రభుత్వం నిర్దేశించిన పనులను సొంత డబ్బులతో పూర్తిచేస్తే వారం రోజుల్లో పదవీ కాలం ముగుస్తున్నా సర్పంచులు చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదు. సొంత డబ్బులతో పనులు చేసి అప్పుల పాలయ్యామని గ్రామ ప్రథమ పౌరులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

సర్పంచ్‌ల సొంత డబ్బులతో పనులు

మెదక్ జిల్లాలో 469 గ్రామపంచాయతీలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో సర్పంచ్‌లు అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో అధికశాతం పనులు సర్పంచులే సొంత డబ్బులతో చేశారు. డంపింగ్ యార్డులు, శ్మశానవాటికలు, పల్లె ప్రకృతివనాలు, క్రీడాప్రాంగణాలు, సీసీరోడ్లు, మురికికాల్వలు, స్ట్రీట్‌లైట్లు తదితర పనులు చేపట్టారు. వీటితోపాటు మన ఊరు - మన బడి, పంచాయతీ భవనాల నిర్మాణం వంటివి చేపట్టారు. అప్పు చేసి ట్రాక్టర్లు కొన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులతో సఖ్యత ఉన్న కొందరు ఏదోవిధంగా లబ్ధి పొందినా.. అత్యధికులు చేసిన పనులకు డబ్బులు రాక అప్పుల పాలయ్యారు. మెదక్ జిల్లాల్లోని పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు రూ.20 కోట్లు వరకు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నారు. సగం పంచాయతీల్లో రూ. 3 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది.

ముందు నుయ్యి... వెనుక గొయ్యి

జిల్లాలో సర్పంచ్‌ల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్నట్లుగా తయారైంది. గెలిచి అప్పుల పాలవటం తప్ప సాధించిందేమీ లేదని సర్పంచ్‌లు వాపోతున్నారు. పెండింగ్ బిల్లుల కోసం రెండేళ్లుగా ఎదురు చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆదుకోవాలని కోరుతున్నారు.

రూ. 28.5 లక్షల బిల్లులు రావాలి



గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన అనంతరం పంచాయతీ పరిధిలో వివిధ రకాల అభివృద్ధి పనులు స్వయంగా చేయించాను. వాటికి సంబంధించి రూ. 28.50 లక్షల బిల్లులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నది. 10 నెలలుగా పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నా. ఎన్ఆర్ఈజీఎస్ కింద ఆరెగూడెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ భవనానికి సంబంధించి రూ. 15 లక్షలు విడుదల కావాల్సి ఉన్నది. ప్రస్తుతం స్లాబ్ వరకు పనులు పూర్తి చేసినా నిధులు మంజూరు కాలేదు. గ్రామ పంచాయతీ నిధుల నుంచి చేపట్టిన పనులకు సంబంధించి రూ. 3.50 లక్షలు, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద చేపట్టిన పనులకు సంబంధించి రూ. 10 లక్షలు నిలిచిపోయాయి. ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో అప్పులపాలయ్యా రోజురోజుకూ వడ్డీలు పెరుగుతున్నాయి. కొత్త ప్రభుత్వమైనా స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలి.

- పాల్వంచ శేఖర్, సర్పంచ్ ఆరెగూడెం, వెల్దుర్తి మండలం

నేటి నుంచి కేజీబీవీల్లో 'వాయిస్ ఫర్ గర్ల్స్'

- కౌమారంలో ఎదురయ్యే సమస్యలపై అవగాహన
- 7, 8, 9 తరగతుల బాలికలపై ఫోకస్
- మహిళా వలంటీర్ల ద్వారా పది రోజులు ప్రత్యేక కార్యక్రమాలు



సంగారెడ్డి అర్బన్, జనవరి 23 : కౌమారదశలో బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించడానికి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యాశాఖ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయల్లో 7, 8, 9 తరగతులు చదువుతున్న బాలికల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. 'వాయిస్ ఫర్ గర్ల్స్' ఎన్‌జీవో సహకారంతో జిల్లావ్యాప్తంగా ఈ నెల 24 నుంచి వచ్చే నెల 2 వరకు జిల్లాలోని అన్ని కేజీబీల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. కౌమారదశలో బాలికలకు వివిధరకాల సమస్యలు ఎదురవుతుంటాయి. వీటిని ఏవిధంగా ఎదుర్కొనాలనే విషయాలపై 'వాయిస్ ఫర్ గర్ల్స్' ఎన్‌జీవోకి చెందిన మహిళా వలంటీర్లు పది రోజుల పాటు కేజీబీవీల్లోనే ఉండి అవగాహన కల్పిస్తారు. సేఫ్టీ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్, స్ట్రెస్, మంచి, చెడు, సమస్యలు వస్తే ఎలా ఎదుర్కొనాలి? ఎలా ఉండాలి, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, హింస, సొసైటీలో ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలపై వాయిస్ ఫర్ గర్ల్స్ వలంటీర్లు విద్యార్థినులకు అవగాహన కల్పించనున్నారు. 12-15 ఏళ్ల పిల్లల వయస్సులో పిల్లలు మెలగాల్సిన తీరును వివరిస్తారు.

3,500 మంది విద్యార్థినులకు ప్రయోజనం

సంగారెడ్డి జిల్లాలో 17 కేజీబీవీలు ఉన్నాయి. ఈ విద్యాసంస్థల్లో 7, 8, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు 3,500 మంది ఉంటారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. గతంలో జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన క్రాంతి అక్కడ కూడా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. అదే స్ఫూర్తితో సంగారెడ్డి జిల్లాలో అమలుకు శ్రీకారం చుట్టారు. బాలికా సాధికారతపై అవగాహన కార్యక్రమాలు కేజీబీవీ విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగపడుతాయని డీఈవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.



కేజీబీవీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు



హైటెన్షన్ స్తంభం.. ఉండేనా? కూలేనా?

మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట గ్రామంలో మట్టి మాఫియా రెచ్చిపోతున్నది. ఎల్లిగలకుంట వద్ద హైటెన్షన్ విద్యుత్ స్తంభం చుట్టూ మట్టిని తవ్వేశారు. దీంతో హైటెన్షన్ టవర్ పునాదులకు రక్షణ లేకుండా పోయింది. ఈ ఘటనపై స్థానికులు సోమవారం రాత్రి పోలీసులకు సమాచారం అందజేయగా మట్టి తరలిస్తున్న లారీని, జేసీబీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ట్రాన్స్‌కో, ఇరిగేషన్ శాఖల అధికారులు టవర్‌ను పరిశీలించారు.

-మనోహరాబాద్, జనవరి 23

ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు చర్యలు

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో అధికారులకు మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశం

మెదక్ అర్బన్, జనవరి 23: ఎస్సీ, ఎస్టీల గౌరవానికి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ మంగళవారం కమిటీ సమావేశంలో ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, యాదవరెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులైన దళితుల పట్ల పోలీస్ అధికారులతో పాటు ఇతర అధికారులు సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. వారికి వ్యవస్థ పట్ల విశ్వాసం కలిగించేలా అధికారులు పనితీరు ఉండాలని పేర్కొన్నారు. ప్రతీ మూడు నెలలకోసారి కమిటీ సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ శేరిసుభాష్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు అందజేసి సాంత్వన కలిగించేలా చూడాలని సూచించారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ వివక్ష లేకుండా అన్నివర్గాలవారు కలిసిమెలసి జీవించాలన్నారు. అనంతరం సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను ఆయన కోరారు. సమావేశంలో జిల్లా ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి

జిల్లాలో ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చూడండి

- వాటిని కాపాడేందుకు చర్యలు చేపట్టండి
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 23: ప్రభుత్వ భూములు కబ్జాకు గురవకుండా చర్యలు చేపట్టాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఇతరశాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ప్రధాన బాధ్యత రెవెన్యూశాఖదేనని పేర్కొన్నారు. మిగిలిన శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఎలాంటి ఓపెన్ ప్లాట్లకు నిర్మాణాలకు ఇంటి నంబర్లు ఇవ్వవద్దని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ భూముల్లోనూ అనుమతులు, ఇంటి నంబర్లు ఇవ్వకూడదని, ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో అనుమతులు లేని నిర్మాణాలు జరిగితే పంచాయతీ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అనుమతులు లేని నిర్మాణాలను గుర్తించి ప్రారంభ దశలోనే కూల్చివేయాలని ఆదేశించారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ సమయంలో అనుమతులు పరిశీలించాలని, 22-ఏ రిజిస్టర్ పరిశీలించి, అన్ని ధ్రువపత్రాల సరిగ్గా ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాలని రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామకంఠం, నిషేధిత భూములను రిజిస్ట్రేషన్ చేయకూడదని చెప్పారు. ప్రభుత్వ భూములలో ఉన్న ఇంటి నంబర్ల వివరాలు అందించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు జరగకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నీటి వనరులను గుర్తించండి

జిల్లాలోని హెచ్ఎండీఏ పరిధిలోని నీటి వనరులను గుర్తించి ఆక్రమణలకు గురికాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని నీటిపారుదల, మైన్స్ వివిధ శాఖల అధికారులను సంగారెడ్డి కలెక్టర్ ఆదేశించారు. హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులు, కుంటలను సర్వే చేసి హద్దులను నిర్ణయించాలన్నారు. రెవెన్యూశాఖ దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు.

మత్స్యశాఖలో అవినీతిపై విచారణ జరిపించాలి

వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా

మెదక్, జనవరి 23: మత్స్యశాఖ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై జిల్లా కలెక్టర్ రాజర్షిషా విచారణ జరపాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ 2022 నవంబరు 14న మత్స్యశాఖ కార్యాలయంలో టైపిస్ట్‌గా పనిచేస్తున్న సురేష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. అనంతరం తిరిగి అతడిని విధుల్లో చేర్చుకున్నారని. అతడినే తిరిగి 2023 ఫిబ్రవరి 23న మరోసారి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారని, మళ్లీ ఇటీవల విధుల్లో చేర్చుకోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. 38 మత్స్యకార్మిక కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.6 లక్షల చొప్పున పరిహారం అందాల్సి ఉన్నా ఇప్పటికీ ఇవ్వలేదని, కానీ సస్పెండ్ అయిన ఉద్యోగిని మాత్రం విధుల్లో చేర్చుకున్నారని వాపోయారు. జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యాదమ్మ, పోచమ్మ, విమోచన సిద్ధమ్మ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- మెదక్ జిల్లా రవాణాధికారి రిచర్డ్ మెయర్స్

మెదక్ అర్బన్, జనవరి 23: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలని జిల్లా రవాణాధికారి రిచర్డ్ మెయర్స్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మెదక్ ఆర్టీవో కార్యాలయ ఆవరణలో వాహనదారులకు రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. ఆర్టీవో కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపారు. అనంతరం ప్రమాదాల నివారణపై సదస్సు నిర్వహించారు.

జహీరాబాద్‌లో

జహీరాబాద్: రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఆర్టీవో కార్యాలయం వద్ద డ్రైవర్లకు రోడ్డు నియమాలపై ఎంవీఐ జయప్రకాష్‌రెడ్డి అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే సమయంలో కొద్దిపాటి నిర్లక్ష్యం చేసినా ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రతీ డ్రైవర్ గ్రహించి, నియమాల ప్రకారం నడపాలని సూచించారు. అనంతరం రోడ్డు భద్రత మాసోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.



ఆటో ర్యాలీను ప్రారంభిస్తున్న డీటీవో రిచర్డ్ మెయర్



జీడీగడ్డ తండాలో నిర్వహించిన పాతపంటల జాతరలో పాల్గొన్న మహిళా రైతులు, ప్రజాప్రతినిధులు

గ్రామగ్రామాన డీడీఎస్ పాత పంటల జాతర

జహీరాబాద్, జనవరి 23 : డీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పాత పంటల జాతర డివిజన్ పరిధిలో కొనసాగుతున్నది. మొగుడంపల్లి మండలంలోని జీడిగడ్డ తండాలో మంగళవారం జాతర, బండ్ల ప్రదర్శన నిర్వహించారు. వివిధరకాల చిరుధాన్యాలతో అలంకరించిన ఎడ్లబండ్లను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా జాతర కోఆర్డీనేటర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ సంప్రదాయ ఆహార పంటలు, చిరుధాన్యాలకు మార్కెట్లో డిమాండ్ పెరుగుతున్నది తెలిపారు. పాత పంటల సాగును ప్రోత్సహించడ్కాఇ డీడీఎస్ కృషిచేస్తున్నదని తెలిపారు. మూడు దశాబ్దాలుగా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తూ రైతులను చైతన్యం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీడీఎస్ సిబ్బంది, మహిళా రైతులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం: న్యాయాధికారి

మెదక్ అర్బన్, జనవరి 23: ఆటల్లో గెలుపోటములు సహజమని జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద పేర్కొన్నారు. మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆమె ప్రారంభించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవో కృషి: నరేందర్

నర్సాపూర్, జనవరి 23: ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టీఎన్జీవో పనిచేస్తున్నదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పేర్కొన్నారు. నర్సాపూర్ టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన డివిజన్ సర్వసభ్య సమావేశానికి నరేందర్, ప్రధాన కార్యదర్శి రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ ఉద్యోగులు అధైర్యపడొద్దని, సమస్యల పరిష్కారానికి టీఎన్జీవో ఎప్పుడూ ముందుంటుందన్నారు.

అప్పులు తీర్చలేక మద్యానికి బానిసై ఆత్మహత్య


కనకయ్య(ఫైల్)

రాయపోల్, జనవరి 23: అప్పులు తీర్చలేక మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా రాయపోల్ గ్రామానికి చెందిన అరికెల కనకయ్య(40) ఎనిమిదేళ్ల క్రితం అప్పులుచేసి బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. తిరిగి వచ్చిన అనంతరం పొలంలో బోరు బావి తవ్వించగా ఫెయిల్ అయ్యింది. దీంతో రూ.6 లక్షల అప్పులయ్యాయి. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలి పనికి వెళ్లిన భార్య ఇంటికి వచ్చి చూసేసరికి కనకయ్య ఉరికి వేలాడుతూ కనిపించాడు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వాళ్లు కిందికి దించగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. భార్య సులోచన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.

కోళ్ల వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి


మృతిచెందిన మల్లేశ్

చిన్నశంకరంపేట, జనవరి 23: కోళ్ల వ్యాన్ ఢీకొని మంగళవారం రాత్రి ఒకరు మృతిచెందారు. వెల్దుర్తి మండలం రామాయపల్లి గ్రామానికి చెందిన కురుమ మల్లేశ్(45) చేగుంట మండలం కర్నాల్‌పల్లిలోని బంధువుల ఇంటికి టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్లి తిరిగి వస్తున్నాడు. చిన్నశంకరంపేట మండలంలోని మెదక్ చేగుంట రహదారిపై రుద్రారం గ్రామ శివారులో కోళ్ల వ్యాన్ ఢీకొట్టింది. దీంతో మల్లేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య బాలవ్వ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

జెండాను అవమానించి.. ఆపై వీడియో తీసి..

● వివాదంగా మారిన ఘటన, ఉద్రిక్తంగా మోర్గి గ్రామం, ఐదుగురిపై కేసు


మోర్గిలో ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న గ్రామస్థులు

నాగల్‌గిద్ద, జనవరి 23: అయోధ్య ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా జెండాను అవమానించే విధంగా వీడియో చిత్రీకరించిన సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం మోర్గికి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మోర్గిలో సోమవారం జరిగిన ఒకవర్గం వారి కార్యక్రమాల అనంతరం రాత్రి అదే గ్రామానికి చెందిన మరో వర్గానికి చెందిన యువకుడు ఆ వర్గానికి చెందిన ధ్వజాన్ని కించపర్చడమే కాకుండా, మనోభావాలు దెబ్బతీసే విధంగా వీడియో చిత్రీకరణ చేశాడు. ఆ వీడియోను సరిహద్దుల్లో ఉన్న కర్ణాటకలోని చిల్లర్గి గ్రామానికి చెందిన వారికి పంపడంతో ఆ గ్రామస్థులు అదే రాత్రి మోర్గికి చేరుకుని విషయాన్ని స్థానికులకు చెప్పగా.. వారు ఆ యువకుడిని పట్టుకుని తమకు అప్పగించారన్నారు. సమాచారం అందుకున్న నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, నాగల్‌గిద్ద ఎస్‌ఐ సిద్దిరాములు సిబ్బందితో కలిసి మోర్గికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. అదనపు బలగాలను రప్పించి పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. ఒకవర్గం మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరించిన యువకుడితో పాటు అదే గ్రామానికి చెందిన నలుగురు ప్రోత్సాహకులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఇదిలా ఉండగా నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఉదయం మోర్గి ప్రధాన రహదారిపై గ్రామస్థులు ధర్నా చేశారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ సిద్దిరాములు, కంగ్టి ఎస్‌ఐ విశ్వజన్, అదనపు బలగాలతో అక్కడికి చేరుకుని నచ్చజెప్పారు. అనంతరం డీఎస్పీ వెంకట్‌రెడ్డి, పోలీసు అధికారులు ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్న వీడియోలు ఎవరికీ పంపొద్దని, ఎవరి వద్దనైనా ఉంటే తొలగించాలని సూచించారు.

స్వచ్ఛందంగా దౌల్తాబాద్ బంద్

హత్నూర, జనవరి 23: హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో సోమవారం రాత్రి శ్రీరాముని శోభాయాత్రపై ఓ వ్యక్తి కాలు బూటు విసరడంతో ఉద్రిక్తతకు దారితీసిన విషయం తెలిసిందే. ఆగంతకులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేస్తూ దౌల్తాబాద్‌లో మంగళవారం వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి పర్యవేక్షణలో పోలీస్ పికెటింగ్ కొనసాగుతున్నది. దౌల్తాబాద్ గ్రామానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రాజకీయ పార్టీ నాయకులను, ఆయా సంస్థల బాధ్యులను అడ్డుకునేందుకు మండలంలోని ప్రధాన రహదారులపై పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇదిలా ఉండగా దౌల్తాబాద్‌లో శ్రీరాముని శోభాయాత్రపై బూటు విసిరిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు జిన్నారం సీఐ వేణుకుమార్ తెలిపారు.


దౌల్తాబాద్‌లో మూసేసిన దుకాణాలు

ఏరియా ఆస్పత్రిలో కాయకల్ప బృందం పరిశీలన

● పరిశుభ్రత, సేవలపై తనిఖీ


ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న కాయకల్ప బృందం

జోగిపేట, జనవరి 23: జోగిపేట ఏరియా ఆస్పత్రిని కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని ఏరియా ఆస్పత్రికి చెందిన వైద్య బృందం మంగళవారం సందర్శించింది. బాన్సువాడ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ నేతృత్వంలో నర్సింగ్ సూపరింటెండెంట్ క్రిష్ణవేణి, హెడ్ నర్సు మల్లీశ్వరి, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ నర్సు అమృతతో కూడిన బృందం ఆస్పత్రి ఆవరణమంతా తిరిగారు. ఆస్పత్రి లోపల, ఆవరణలో పరిశుభ్రతను, అలాగే ఇన్‌పేషెంట్ వార్డుల్లోనూ తిరిగిన వారు అక్కడి బాత్‌రూంలు, మురుగునీటి వ్యవస్థను పరిశీలించారు. అనంతరం వైద్య సేవలు, చికిత్సల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతియేటా ప్రతీ ఆస్పత్రిలోనూ రెండురకాల తనిఖీలు నిర్వహిస్తామన్నారు. పరిశుభ్రత, సేవలపై ఒకసారి ఇంటర్నల్‌గా, మరోసారి ఎక్స్‌టర్నల్‌గా పరిశీలనకు బృందాలు వస్తాయని చెప్పారు. ఇంటర్నల్ తనిఖీలో ఒక ఆస్పత్రిని మరో జిల్లాలోని ఆస్పత్రి బృందం తనిఖీ చేస్తున్నదన్నారు. వీరిచ్చిన మార్కుల ఆధారంగా రాష్ట్రస్థాయిలోని మరో బృందం వచ్చి తనిఖీలు చేస్తున్నదని పేర్కొన్నారు. దీనినే ఎక్స్‌టర్నల్ తనిఖీ అంటారన్నారు. తనిఖీల్లో ఎక్కువ మార్కులు పొందిన ఆస్పత్రులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామన్నారు. జోగిపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, వైద్యురాలు సమైక్యభారతి, హెచ్‌ఐవీ యూనిట్ ఇన్‌చార్జి నర్సింహా, నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

● 18 నెలల క్రితం హత్య కేసును ఛేదించిన పోలీసులు
● నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు


పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యాధికారులు


మృతుడు కావేటి కిష్టయ్య (ఫైల్)

చేగుంట, జనవరి 23: గత 18 నెలల క్రితం జరిగిన ఓ హత్య కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించి, నిందితులను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్టు రామాయంపేట సీఐ లక్ష్మీబాబు వెల్లడించారు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన కావేటి కిష్టయ్య 2022, జూలై 16న మృతిచెందాడు. అనంతరం గ్రామంలో కిష్టయ్య మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. 18 నెలల అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లి కిష్టయ్య మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయటంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. కుటుంబసభ్యులను అదుపులోకి తీసుకున్న సీఐ లక్ష్మీబాబు విచారణ చేపట్టడంతో హత్య కేసు వెలుగులోకి వచ్చింది. 18 నెలల క్రితం పూడ్చిపెట్టిన మృతదేహానికి వైద్యాధికారులతో సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. హత్యకు కారకులైన కుమారుడు స్వామి, పెద్ద కుమార్తె రేణుకను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన అల్లుడు అశోక్ పాత నేరం కింద శిక్ష అనుభవిస్తూ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కిష్టయ్య పేరున ఉన్న వ్యవసాయ భూమి కోసం కన్నతండ్రినే కొడుకు, కూతురు హత్య చేశారని సీఐ తెలిపారు. హత్య కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేయడం పట్ల పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు.


వివరాలను వెల్లడిస్తున్న సీఐ లక్ష్మీబాబు

గద్దర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

● రచయిత, ప్రొ.కంచ ఐలయ్య ● 31న తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహావిష్కరణ సభ


గద్దర్ విగ్రహావిష్కరణ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రచయిత ప్రొ.కంచ ఐలయ్య

సంగారెడ్డి అర్బన్, జనవరి 23: ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతిని తెలంగాణ ప్రభుత్వ అధికారికంగా నిర్వహించాలని ప్రసిద్ధి రచయిత, ప్రొఫెసర్ కంచ ఐలయ్య డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో గద్దర్ గళం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 31న నిర్వహించే గద్దర్ విగ్రహావిష్కరణ సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. గద్దర్ కేవలం పాటగాడు మాత్రమే కాదని, ఒక ఫిలాసఫర్, రచయిత, నటుడు, మేధావిగా ఈ దేశానికి ఎంతో సేవ చేశారన్నారు. అలాంటి మహా కళాకారుడిని గుర్తు చేసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజలకు ఉన్నదన్నారు. గద్దర్ గళం ఫౌండర్ కొల్లూరి సత్తయ్య మాట్లాడుతూ గద్దర్‌కు తెల్లాపూర్ గ్రామానికి ఎంతో అనుబంధం ఉన్నదని పేర్కొన్నారు. గద్దర్ విగ్రహావిష్కరణకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా, కంచ ఐలయ్య, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, జేబీ రాజు, బాలయ్య, గద్దర్ కుమార్తె వెన్నెల, తెల్లాపూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, సినీ దర్శకుడు వేణుఉడుగుల, ప్రముఖ కవి, రచయిత డాక్టర్ పసునూరి రవీందర్, భరత్, సింగర్ వరం, శంకర్, మణికంఠ హాజరుకానున్నట్లు సత్తయ్య తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు

● నిద్రిస్తున్న భక్తుడి పైనుంచి కారు తోలిన డ్రైవర్ ● అక్కడికక్కడే దుర్మరణం
● అనుయాయులతో గొడవపడి డ్రైవర్ పరార్



మృతిచెందిన పెద్దింటి బలరాం, బలరాం(ఫైల్)

చేర్యాల, జనవరి 23: కారు డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ వ్యక్తి నిద్రలోనే ప్రాణాలు కోల్పోయాడు. కొమురవెల్లి మల్లన్న పట్నంవారాన్ని పురస్కరించుకుని నాగర్ కర్నూల్ జిల్లా, తాండూరు మండలం రిశీవాడ గ్రామానికి చెందిన పెద్దింటి బలరాం(65) ఇంటిల్లిపాదిగా చేరుకుని మల్లన్నను దర్శించుకున్నారు. అగ్నిగుండాలు దాటిన అనంతరం సోమవారం సాయంత్రం కొండపోచమ్మకు తరలివెళ్లారు. ఆలయ సమీపం నాగపురి శివారులోని ఆరుబయట ప్రదేశంలో బస చేసి దర్శనాలు చేసుకున్నారు. రాత్రి కుటుంబసభ్యులందరితో భోజనం చేసి నిద్రించారు. ఇతర భక్తులు సమీప ప్రదేశంలో వాహనాలను నిలిపారు. ఓ కారు డ్రైవర్ అర్ధరాత్రి దాటిన తర్వాత సంబంధిత ప్రదేశం నుంచి బయటకు వెళ్లేందుకు కారును వెనకకు నడిపాడు. అక్కడ బలరాం నిద్రించిన విషయాన్ని చూడకుండానే అతడి పైనుంచి కారు తీసుకెళ్లడంతో మృతిచెందాడు. గమనించిన కుటుంబసభ్యులు అడ్డుకుని నిలదీయడంతో తన అనుయాయులతో గొడవపడి ఉడాయించాడు. ఈ విషయమై మృతుడి కుటుంబీకులు మంగళవారం కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పంచనామా చేసి చేర్యాల మార్చురీలో పోస్టుమార్టం నిర్వహింపజేసిన అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.


ఉన్నత లక్ష్యానికి చేరువయ్యేందుకు కష్టపడి చదవాలి

● గజ్వేల్ ఏసీపీ మడత రమేశ్


గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మోటివేషనల్ తరగతిని ప్రారంభిస్తున్న ఏసీపీ, సినీనటులు

గజ్వేల్, జనవరి 23: విద్యార్థులు ఉన్నత లక్ష్యానికి చేరువయ్యేందుకు కష్టపడి చదవాలని గజ్వేల్ ఏసీపీ మడత రమేశ్ పిలుపునిచ్చారు. ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోటివేషనల్ సెమినార్ మహతి ఆడిటోరియంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా గజ్వేల్ ఏసీపీ రమేశ్, సినీనటులు కేవీ ప్రదీప్, నళిని హాజరయ్యారు. ఏసీపీ రమేశ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించాలని, సమాజంలో జరుగుతున్న సామాజిక పరిస్థితులను అర్థం చేసుకుంటూ ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని సాధించే విధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ సభ్యులను ఏసీపీ అభినందించారు. సినీనటుడు కేవీ ప్రదీప్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చాలా నేర్చుకోవడానికి అవకాశాలుంటాయని, ఇలాంటి సమయంలోనే విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించాలని, వారి ఆశయాల, లక్ష్యాల సాధనకు పట్టువదలకుండా శ్రమించాలన్నారు. ఆధునిక ప్రపంచంలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకునేందుకు ఉన్నతమైన లక్ష్యాలను చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు వినోద్, రవి, ప్రధాన కార్యదర్శి కర్నాకర్, సభ్యులు వెంకట్, అక్బర్, స్వామి, విష్ణు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధతో కూలీ ఆత్మహత్య


ఆగయ్య(ఫైల్)

గజ్వేల్ రూరల్, జనవరి 23: అప్పులబాధతో కూలీ మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామానికి చెందిన వల్లపు ఆగయ్య(40) వడ్డెర కులస్తుడు. గ్రామంలో 40 ఎకరాల వరకు విస్తరించి ఉన్న రాయిగుట్ట వద్ద రాళ్లు కొడుతూ, కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత ప్రభుత్వం ఈ గుట్టపైన మిషన్ భగీరథ తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేసింది. రాళ్లు బ్లాస్టింగ్ చేసే సమయంలో ప్లాంట్‌కు పగుళ్లు, తదితర ఇబ్బందులు ఎదురవుతుండడంతో సంబంధిత అధికారులు రాయి కొట్టేందుకు అనుమతులు నిరాకరించారు. దీంతో గ్రామానికి చెందిన 50 వడ్డెర కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి. ఆగయ్య ఉపాధి కోసం గజ్వేల్ సమీప గ్రామాల్లో కూలి పనులకు వెళ్తుండేవాడు. కుటుంబ అవసరాల కోసం రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. అయితే అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపం చెంది మూడురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయమై కుటుంబసభ్యులు గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా గ్రామ శివారు నిర్మానుష్య ప్రదేశంలో చెట్టుకు ఉరేసుకుని ఉండడం చూసి సమీప వ్యవసాయ పొలాల రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకుతీశారు. ఘటనా స్థలానికి ఆగయ్య భార్య మృతదేహం తన భర్తదేనని చెప్పింది. పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య కనకవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ ప్లాంట్ ఏర్పాటుతో 50 కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయని సర్పంచ్ తూం శేఖర్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

● చిట్కుల్ కేజీబీవీ ఎస్‌వో అంజలి, కిక్ బాక్సింగ్ ఇంటర్నేషనల్ కోచ్ పోచయ్య


మెడల్స్, ప్రశంసాపత్రాలను చూపుతున్న విద్యార్థులు

చిలప్‌చెడ్, జనవరి 23: క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉన్నదని చిట్కుల్ కేజీబీవీ ఎస్‌వో అంజలి, కిక్ బాక్సింగ్ ఇంటర్నేషనల్ కోచ్ పోచయ్య అన్నారు. శని, ఆదివారాల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ ఉమెన్స్ లీగ్ పోటీల్లో కస్తూర్బాకు చెందిన ఆరుగురు విద్యార్థులు పాల్గొని బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారు. మంగళవారం విద్యార్థులకు మెడల్స్‌తో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. పీఈటీ శారద, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, పద్మావతి, ప్రశాంతి, మంజుల, మహేశ్వరి, మధులత, కీర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

270 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

● గుజరాత్‌కు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
● పౌర సరఫరాల శాఖకు అప్పగింత

పుల్‌కల్, జనవరి 23: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని సంగారెడ్డి జిల్లా పుల్కల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని కాటేదాన్ నుంచి (జీజే25యూ7752) నంబరు గల లారీలో 270 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుజరాత్‌కు తరలిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున బియ్యం తరలిస్తున్న లారీని డ్రైవర్ రాజు భాయ్ బోసియా శివంపేట గ్రామ శివారులో గల దాబా వద్ద జోగిపేట వైపు వెళ్తూ జాతీయ రహదారిపై నిలిపాడు. ఈ క్రమంలో అటువైపుగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న స్థానిక పోలీసులకు అనుమానం వచ్చి డ్రైవర్‌ను ప్రశ్నించగా, పొంతన లేని సమాధానం చెప్పాడు. దీంతో లారీలో ఉన్న సరుకును పరిశీలించగా.. అది రేషన్ బియ్యంగా గుర్తించారు. లారీని పుల్కల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్ కమ్ ఓనర్ రాజు భాయ్ బోసియాపై కేసు నమోదు చేశారు. అనంతరం పట్టుబడిన రేషన్ బియ్యాన్ని పోలీసులు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు.

ఘనంగా నేతాజీ జయంతి

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి దేశ స్వాతంత్ర్యం కోసం ఉద్యమాన్ని నడిపిన ధీరుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మిన వ్యక్తి సుభాష్‌చంద్రబోస్ అని తెలిపారు.

సంగారెడ్డి అర్బన్, జనవరి 23: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్, ఎన్‌సీసీ, సామాజిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నేతాజి సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పరాక్రమ దివస్ ను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ పాల్గొన్నారు.

● **జిన్నారం:** జిన్నారంలో ఎంపీటీసీ లావణ్యనరేష్, వార్డు సభ్యులు శ్రీనివాస్‌యాదవ్, నాయకులు నరేందర్ గౌడ్, భాస్కర్, ప్రదీప్, నీలం లత, విష్ణుమూర్తి తదితరులు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **పెద్దశంకరంపేట:** పెద్దశంకరంపేటలో నేతాజీ విగ్రహానికి ఎంపీపీ జంగం శ్రీనివాస్, సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, ఆర్‌వీఎస్ సంస్థ అధ్యక్షుడు గంగారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాయిని మధుసూదన్, కాంగ్రెస్ రాష్ట్ర ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి జనార్థన్ పాల్గొన్నారు.

● **చిన్నశంకరంపేట:** మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, మల్లిఖార్జున్, రాజు, వెంకన్న, వెంకటేష్, నిద్రబోయిన రాజు పాల్గొన్నారు.

● **గుమ్మడిదల:** గుమ్మడిదలలో చంద్రబోస్ విగ్రహానికి జడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు.

● **చేగుంట:** చేగుంట పరిధిలోని వడియారంలో సుభాష్ చంద్రబోస్ జయంతిని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

● **తూప్రాన్:** తూప్రాన్ పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉద్యమ నాయకులు మన్నె శ్రీనివాస్‌రావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నలింగ్ మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ 15వ వార్డు అధ్యక్షుడు బాయికాడి ఆంజనేయులుగౌడ్, ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పల్లెపాటి మాధవి, గడ్డం వెంకట్, దామోజీ రవిచారి పాల్గొన్నారు.

● **మాసాయిపేట:** మండలంలోని కొప్పులపల్లి గ్రామంలో నేతాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు.

● **చేగుంట:** నార్సింగి మండల కేంద్రంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని బీజేపీ, సంఘ్ పరివార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేష్, విశ్వ హిందూ పరిషత్ మండలాధ్యక్షుడు ఆంజనేయులు, దాలే అమరేందర్, కొన్యాల సోమరాజు, బాలరాజు, బీజేపీ మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, సత్యం, మల్లికార్జున్, చంద్రం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


జిన్నారంలో నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


పెద్దశంకరంపేట పట్టణంలో..


తూప్రాన్ పట్టణంలో..


గుమ్మడిదల మండల కేంద్రంలో..



సంగారెడ్డి పట్టణంలో..


నార్సింగి మండల కేంద్రంలో..

నేడు సర్వసభ్య సమావేశం

పెద్దశంకరంపేట, జనవరి 23: పెద్దశంకరంపేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ జంగం శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా మంగళవారం తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని ఆమె సూచించారు.

విద్యార్థులకు టై, బెల్టుల అందజేత

పాపన్నపేట, జనవరి 23: బాచారంలోని యూపీఎస్ విద్యార్థులకు గ్రామ పంచాయతీ సహకారంతో సర్పంచ్ వెంకటరాములు టై, బెల్టులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జె.సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు కె.తోటవ్వ, డి.మమత, ఉప సర్పంచ్ రాంగుప్తా, మాజీ ఎంపీపీ పవిత్రదుర్గయ్య పాల్గొన్నారు.

ఎల్లారెడ్డికి బస్సును నడపాలి

నారాయణఖేడ్, జనవరి 23: ఖేడ్ నుంచి కల్హేర్, మాసాన్‌పల్లి, కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్‌ల మీదుగా ఎల్లారెడ్డి వరకు, అలాగే ఖేడ్ నుంచి హన్మంత్‌రావుపేట, మాద్వార్, లింగనాయక్‌పల్లి మీదుగా గునుకుల కుంటకు బస్సులు నడపాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్యను ఆదేశించారు. మంగళవారం డీఎంతో పాటు పీఆర్వో పాండు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను ఆయన నివాస గృహంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా బస్సులు నడపాలని ఆదేశించారు. కాగా పలు మార్గాల్లో దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేయాలని, పాటు అవసరమైన కొత్త బస్సులు తెప్పించాలని డీఎం ఎమ్మెల్యేను కోరారు. అందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి హామీ ఇచ్చారు.

ఘనంగా దర్గా ఉర్సు

చిన్నశంకరంపేట, జనవరి 23: చిన్నశంకరంపేట మండల పరిధిలోని అంబాజీపేట గ్రామంలోని దర్గా ఉర్సు మంగళవారం ఘనంగా నిర్వహించారు. దర్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దీపారాధన చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పలువురు రాజకీయ నాయకులు దర్గాను దర్శించుకుని ప్రార్థనలు చేశారు.

బోరు పైపులను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

కంది, జనవరి 23: కంది మండలం ఎద్దుమైలారం గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే ప్రభుత్వ బోరు పైపులను అదే గ్రామానికి చెందిన దేవునూరి జయకృష్ణ ధ్వంసం చేశాడు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఇంద్రకరణ్ ఎస్ఐ ఎం.మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. గ్రామ కార్యదర్శి పద్మదాసుల శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

టీఆర్‌టీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డీఈవో

సంగారెడ్డి అర్బన్, జనవరి 23: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని మంగళవారం డీఈవో వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో కార్యాలయ ఏడీ శంకర్, సూపరింటెండెంట్ సురేఖ, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి ప్రదీప్ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

నారాయణఖేడ్, జనవరి 23: టీపీటీఎఫ్ క్యాలెండర్, డైరీని మంగళవారం ఖేడ్‌లో మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, సంఘం నాయకులు విజేందర్‌రెడ్డి, మొగులప్ప, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి

● **సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం**

పుల్‌కల్, జనవరి 23: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం కార్మికులకు పిలుపునిచ్చారు. చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులోని బీరు పరిశ్రమలో మంగళవారం నిర్వహించిన యూనియన్ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నదని ధ్వజమెత్తారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ పెట్టుబడిదారులు, కార్పొరేట్ వ్యవస్థకు పెద్దపీట వేస్తున్నారని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని విమర్శించారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న నిర్వహించనున్న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమ్మెలో అన్నీ వర్గాల ప్రజలు భాగస్వాములయ్యేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, యూనియన్ పరిశ్రమ వర్కింగ్ ప్రెసిడెంట్ బాగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రసన్నరావు, ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ

సంగారెడ్డి రూరల్: పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు విమర్శించారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి పది సంవత్సరాలు గడిచినా కార్మికులకు చేసిందేమీ లేదన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ నాలుగు కార్మిక చట్టాలను తీసుకువచ్చి పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతూ, కార్మికుల హక్కులను హరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా నిత్యావసర వస్తువుల ధరలను కేంద్రం పెంచిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో కార్మికవర్గం పాల్గొని మోదీకి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకుడు రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రావు, సుందర్, యాదగిరి, లక్ష్మయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చౌటకూర్ మండలం శివంపేట బీరు పరిశ్రమలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

అందోలు ప్రజలకు రుణపడి ఉంటా

● **మంత్రి దామోదర్ రాజనర్సింహ**


మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, జనవరి 23: అందోలు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం జోగిపేటలోని సోమవంశ సహస్రార్జున క్షత్రియ సమాజ్ వార్షికోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో గెలిపించిన ప్రజలకు సేవచేస్తూ ఈ ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని చెప్పారు. సోమవంశ క్షత్రియ సమాజ్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం మంత్రిని ఎస్ఎస్‌కే సమాజ్(పట్కరి సమాజ్)ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్.సురేందర్‌గౌడ్, చిట్టిబాబు, డాకూరి శంకర్, సురేశ్, నాయకులు డాకూరి వెంకటేశం, పడిగె సత్యం, ఎస్ఎస్‌కే సమాజ్ బాధ్యులు జగన్నాథం, వెంకటేశం, సంతోష్, మహేశ్, శేఖర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

జిన్నారం, జనవరి 23: బొల్లారం మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని చైర్‌పర్సన్ రోజారాణి తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీలోని వైఎస్ఆర్ కాలనీలో చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్ సంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, కౌన్సిలర్ సతీష్, ఏఈ శ్రీకాంత్ పర్యటించారు. కాలనీలో నెలకొన్న నీటి సమస్య ఉన్నదని కాలనీవాసులు తెలియజేయగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. త్వరలోనే మున్సిపాలిటీలో చేపట్టిన శాశ్వత నీటి సరఫరా పనులు పూర్తి కానున్నట్లు తెలిపారు.

గ్రామ కంఠంలోని భూముల సర్వే

చిలప్‌చెడ్, జనవరి 23: చిట్కుల్ గ్రామ కంఠంలోని ఖాళీ స్థలాలను గుర్తించి, ఆన్‌లైన్‌లో పొందుపరుచుటకు మంగళవారం గ్రామ కార్యదర్శి తిరుపతి ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ కంఠంలోని ఖాళీ స్థలాలు అనగా ఐకేపీ ప్లాట్‌ఫామ్, తెలంగాణా క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతివనం, గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ బీ-సెంటర్, రైతు వేదిక, ప్యాడి ప్లాట్‌ఫామ్‌లను సర్వేచేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ సుధాకర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్

మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక

మనోహరాబాద్, జనవరి 23: బీఆర్ఎస్ రాష్ట్ర సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్, మనోహరాబాద్ గ్రామ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి బీఆర్ఎస్‌కు షాకిచ్చారు. మంగళవారం సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో హైదారాబాద్‌లోని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు నివాసంలో వారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహిపాల్‌రెడ్డి గత తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీలో పనిచేశారు. కాగా ఈ విషయం అధికారికంగా ఎవరూ విలేకరుల సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం.

గొల్లపల్లి మల్లన్నస్వామి ఉత్సవాలు షురూ

నర్సాపూర్, జనవరి 23: నర్సాపూర్ మండలం గొల్లపల్లిలోని ప్రముఖ ఆలయమైన కేతకీ మల్లికార్జునస్వామి ఆలయ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం గంగ స్నానానికి వెళ్లారు.

దుబ్బాకను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

● **ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

చేగుంట, జనవరి 23: దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నార్సింగి మండల పరిధిలోని నర్సంపల్లి, పెద్ద తండా గ్రామాల్లో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ.కోటితో రెండు గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసినందుకు సర్పంచులను అభినందించారు. చేగుంట, నార్సింగి మండలాలతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కాళేశ్వరానికి సంబంధించిన కాలువల నిర్మాణం పూర్తి చేయడానికి మంత్రిని కలిసినట్లు తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచి మిగిలిపోయిన కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. నర్సంపల్లి గ్రామంలో అంగన్‌వాడీ భవనం, పల్లె దవాఖాన, గ్రామపంచాయతీ, మహిళా సంఘ భవనం, ఎస్సీ కమ్యూనిటీ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. నర్సంపల్లి పెద్దతండాలో పాఠశాల ప్రహరీ, గ్రామపంచాయతీ భవనం, కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను సర్పంచులు ఛత్రియనాయక్, బొమ్మగారి భారతిసత్యం సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ వైస్ చైర్మన్ బాణాపురం కృష్ణారెడ్డి, ఎంపీపీ చిందం సబిత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మైలారం బాబు, ప్రధాన కార్యదర్శి అంచనూరి రాజేష్, నార్సింగి సొసైటీ చైర్మన్ శంకర్‌గౌడ్, ఎంపీటీసీ సత్యనారాయణ, ఏపీఎం అశోక్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బాష, లాలు, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీపతిరావు, ఐకేపీ సీసీ సుల్తానా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


నర్సంపల్లి పెద్దతండాలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

అనుమతుల్లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

● **ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్**

సంగారెడ్డి రూరల్, జనవరి 23: జిల్లాలో ఎలాంటి అనుమతుల్లేని ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్ సురేఖకు మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని పలు ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు ఏడవ తరగతి వరకు అనుమతులు తీసుకుని 8, 9 తరగతులకు కూడా అడ్మిషన్ తీసుకుంటూ రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. కనీసం ఆట స్థలాలు లేకుండా స్కూల్‌లను నడుపుతున్నారని, తప్పుడు ప్రచారంతో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులను మోసం చేస్తున్నారని విమర్శించారు. అనుమతులు లేకుండా విద్యాసంస్థలను నడిపిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్, పుడ్లిక్, కార్తిక్ ఉన్నారు.



డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ సురేఖకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందడుగు వేయాలి

● **అదనపు కలెక్టర్ మాధురి**

● **జిల్లా సైన్స్ కేంద్రంలో గణిత టాలెంట్ టెస్ట్**

సంగారెడ్డి అర్బన్, జనవరి 23: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందడుగు వేయాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురి సూచించారు. సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో విద్యాశాఖ, తెలంగాణ గణిత ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి గణిత ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ.. గణితమనేది జీవితంలో మనిషికి కచ్చితత్వాన్ని, వేగంగా ఆలోచించే మేధస్సును, క్రమశిక్షణను అలవరుస్తుందన్నారు. గణితం పట్ల ఇష్టాన్ని, ప్రేరణను కలిగించే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. గణిత ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిద్ధారెడ్డి, శ్రీనివాస్‌రాథోడ్ మాట్లాడుతూ.. గణిత ప్రతిభా పరీక్షలో 12మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు అదనపు కలెక్టర్ మాధురి ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, టీఎంఎఫ్ ఆర్థిక కార్యదర్శి సిద్ధేశ్వర్, రాష్ట్ర పరిశీలకులు, అసోసియేట్ అధ్యక్షుడు రామలింగారెడ్డి, రంగ్యానాయక్, రవీందర్, చందర్, పుణ్యానాయక్, రాధాకృష్ణ, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



గణిత టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభను కనబర్చిన విద్యార్థులతో అదనపు కలెక్టర్ మాధురి

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

మనోహరాబాద్, జనవరి 23: ఆర్థిక ఇబ్బందుతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ మండలంలోన మంగళవారం జరిగింది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన మురారి మిశ్రా(25) తన ఇద్దరు అన్నలతో కలిసి మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో 20 సంవత్సరాల నుంచి నివాసముంటున్నారు. స్థానికంగా ఉన్న గ్లోస్టర్ కేబుల్ పరిశ్రమలో మిశ్రా అన్నలిద్దరూ పని చేస్తుండగా.. మిశ్రా గ్రామంలో కమ్యూనికేషన్ షాపును నడుపుతున్నాడు. అయితే షాపు నడవకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. సోమవారం రాత్రి షాపులో పడుకుంటానని అన్నకు చెప్పి వెళ్లాడు. మంగళవారం ఉదయం అన్నలిద్దరు వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. మృతుడి పెద్దన్న వినయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూర్ఛతో పొలంలో పడి ఊపిరాడక వ్యక్తి మృతి

పాపన్నపేట, జనవరి 23: పొలం పనుల కోసం వెళ్లిన వ్యక్తికి మూర్ఛ రావడంతో పొలంలో పడి ఊపిరాడక మృతి చెందాడు. ఈ సంఘటన గాజులగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ సంగన్న తెలిపిన వివరాల ప్రకారం.. గాజులగూడెం గ్రామానికి చెందిన నాయికోటి లక్ష్మయ్య(37) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. లక్ష్మయ్యకు అప్పుడప్పుడు మూర్ఛ వస్తుంది. మంగళవారం భార్యతో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. భార్యకు తమ పొలంలో పనులు చెయ్యమని చెప్పి.. కొంత దూరంలో ఉన్న మరో పొలంలో ఉన్న నీటి పైపు వాల్‌ను బంద్ చేసేందుకు లక్ష్మయ్య వెళ్లాడు. ఈ క్రమంలో మూర్ఛ రావడంతో పొలంలోని నీటిలో పడి, ఊపిరాడక మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


ఖేడ్‌లో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు కప్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, జనవరి 23: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్ సూచించారు. ఖేడ్‌లో గత పదిహేను రోజులుగా నిర్వహించిన ఎస్‌కేఎస్ అండ్ పీఎస్ఆర్ గోల్డెన్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. రాయల్ వారియర్స్ టీం గెలవగా నేచురల్ స్టార్ టీం రన్నర్‌గా నిలిచింది. ఆయా టీంలకు ఎమ్మెల్యే, మాజీ ఎంపీ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దారం శంకర్, వివేకానంద్, సద్దాం, మాజీ ఎంపీపీ జీవ్లనాయక్, చందర్‌నాయక్, మాణిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల్లో అంబేడ్కర్ ఫొటోను పెట్టాలి


తహసీల్దార్ మన్నన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చిన్నశంకరంపేట, జనవరి 23: గణతంత్ర వేడుకల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను పెట్టాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు డప్పు స్వామి కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి తహసీల్దార్ మన్నన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు ఆఫీసులు, వివిధ సంఘాలు, యువజన సంఘాలు నిర్వహించే జెండా పండుగలో అంబేడ్కర్ ఫొటోను ఉంచాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు మురళి, విజయ్‌కుమార్, కర్రె కుమార్, బాబు, శ్రీనివాస్, గైనికాడి శ్రీకాంత్, సంతోష్ ఉన్నారు.

టీపీటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి


గుమ్మడిదలలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుమ్మడిదల, జనవరి 23: ఖమ్మంలో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాజారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం గుమ్మడిదల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి, మండలాధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ.. టీపీటీఎఫ్ మహాసభలు ఖమ్మంలో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో జరుగుతాయన్నారు. మహాసభలలో అనేక అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, అజ్మతుల్లా, సరోజ, శోభారాణి, రత్న, మాధవి, సువర్ణ, జగన్నాథం, ఇందిరా కులకర్ణి పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహిద్దాం

సంగారెడ్డి అర్బన్, జనవరి 23: బాలికా విద్యను ప్రోత్సహించి నవ సమాజాన్ని నిర్మిద్దామని సంగారెడ్డిలోని ప్రభుత్వ తారా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సహకారంతో విద్యార్థినులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. నవసమాజ నిర్మాణంలో స్త్రీల పాత్ర ప్రధానమైనదన్నారు. బాలికలకు రక్షణ కల్పించి వారి విద్యాభివృద్ధికి కృషి చేసినప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, వెంకటేశం, విశ్వేశ్వరశర్మ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'అడవులను రక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిది'

చేగుంట, జనవరి 23: అడవులను రక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిదని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ సైదులు అన్నారు. చేగుంట మండలంలోని రుక్మాపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లాంటేషన్‌లోని మొక్కలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీశాఖ సైదులు మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాల్లో నాటిన మొక్కలను కాపాడుకొని అడవుల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన తెలిపారు. ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట అటవీ అధికారి రవిప్రసాద్, రామాయంపేట అటవీ అధికారి విద్యాసాగర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగరాణి, ఇబ్రహీంపూర్ ఫారెస్ట్ అధికారి మధుబాల ఉన్నారు.

ఇబ్రహీంపూర్ అటవీ ప్రాంతంలో చిరుత సంచారం

చేగుంట, జనవరి 23: చేగుంట మండలం ఇబ్రహీంపూర్ అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్న కదలికలు, ఆనవాళ్లు ఉన్నాయని రామాయంపేట డిప్యూటీ రేంజ్ అధికారి నాగరాణి మంగళవారం తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇబ్రహీంపూర్ అటవీ ప్రాంతంలోని ఇబ్రహీంపూర్, రుక్మాపూర్, కిష్టాపూర్, డి.ధర్మారం, చిట్టోజిపల్లి, రాంపూర్, కన్యారం గ్రామాలకు చెందిన రైతులు పొలాలకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.